క్లుప్తంగా

అతి వేగంతోనే ప్రమాదాలు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

జూపాడుబంగ్లా: ఆటోలను అతివేగంగా నడిపి ప్రయాణికుల ప్రాణాలను బలిగొనవద్దని ఎస్ఐ లక్ష్మీనారాయణ ఆటోడ్రైవర్లకు సూచించారు. శనివారం ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆటోలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. అలాగే డ్రైవరుకు ఇరువైపుల ప్రయాణికులను కూర్చోబెట్టుకొని వాహనాలను నడపవద్దని చెప్పారు. వివిధ గ్రామాల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నీటి వనరుల గణనపై శిక్షణ



మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మావతి

బండి ఆత్మకూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నీటివనరులు, జలాశయాల గణనపై శనివారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.పద్మావతి మాట్లాడుతూ.. భవిష్యత్ అవసరాల కోసం నీటి వనరులను సంరక్షించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. గణన ద్వారా వాస్తవ పరిస్థితిని తెలుసుకుని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీర్ అర్జున్ సింగ్, మండల సహాయ గణాంక అధికారి అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్చండి



విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించిన దృశ్యం

బండి ఆత్మకూరు: ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని బండి ఆత్మకూరు స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహిమాన్ కోరారు. శనివారం ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సంతజూటూరు గ్రామంలో ఆరుగురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించగా వారి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దస్తగిరి, ఎంఈఓ యశోద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్లు నూరుల్లా, సుధాకర్ రెడ్డి, భారతి పాల్గొన్నారు.

మానవీయ విలువలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్లు

నందికొట్కూరు: విద్యలో మానవీయ విలువలే అసలైన శక్తి అని నంద్యాల జిల్లా కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు శ్రీరామ్, నాగన్న పేర్కొన్నారు. శనివారం మిడుతూరు మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు మానసిక పరిపక్వత, మానవీయ విలువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్య అనేది మార్కులకు మాత్రమే పరిమితం కాదన్నారు. ఎంఈఓ శ్రీనాథ్ మాట్లాడుతూ పరీక్షల ఫలితాల సమయంలో విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడిని అధిగమించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

శక్తి టీంతో ఆపద నుంచి రక్ష

మహానంది: ఆపదలో ఉంటే అమ్మాయిలు, మహిళలు వెంటనే 100, 112 నంబర్లకు ఫోన్ చేయాలని నంద్యాల శక్తిటీం సభ్యులు తెలిపారు. మహానంది వివేకానంద పాఠశాలలో కరస్పాండెంట్ రుక్మాంగధర రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు సైబర్ నేరాలపై వివరించారు.

22న ఉద్యోగ మేళా

నంద్యాల (అర్బన్): ఈనెల 22న నూనెపల్లె ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఆపై విద్యార్హత కలిగి 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉన్న యువతీయువకులు మేళాకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు www.ncr.gov.in రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

రేపు మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

ఉయ్యాలవాడ : స్థానిక మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరం సంబంధించి 6వ తరగతిలో ప్రవేశం కోసం సోమవారం అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో ప్రవేశం కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 119 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో లేదా స్కూల్ వద్దకు వచ్చి హాల్ టికెట్లు పొందవచ్చునన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.



ఈదురుగాలులు, వర్షం తాకిడికి నేల రాలిన మామిడి కాయలు



నేలరాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు మంగన్న దంపతులు

గాలి,వాన బీభత్సం

- నేలరాలిన మామిడి కాయలు
- మామిడి రైతులు విల విల

జూపాడుబంగ్లా: శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులు, మోస్తం వర్షం తాకిడికి మామిడి రైతుల ఆశలు నేలరాలాయి. మండలంలోని జూపాడుబంగ్లా, తరిగోపుల, పారుమంచాల, పి.లింగాపురం, రామసముద్రం, మండ్లెం, భాస్కరాపురం తదితర గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. మరో వారం రోజులుంటే మామిడి పండ్లు చేతికందుతాయని రైతులు వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. శుక్రవారం రాత్రి వీచిన బలమైన గాలులు, వర్షం తాకిడికి చెట్లకున్న మామిడికాయలు రాలి దెబ్బతినటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరిగోపుల గ్రామానికి చెందిన మంగన్న అనే రైతుకు నాలుగు ఎకరాల్లో 150 మామిడిచెట్లున్నాయి. వాటికి ఆశాజనకంగా కాయలు కాయటంతో ఈ ఏడాది కొంతలో కొంత లాభాలు ఆర్జించవచ్చునని ఆశపడ్డాడు. గాలి, వానకు కాయలు దాదాపుగా నేలరాలిపోయాయి. దీంతో ఆయనకు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈయనతో పాటు మరికొంత మంది మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

మాన్యం వేలాలకు ఆసక్తి చూపని రైతులు



మాన్యం వేలం పాటకు హాజరైన దేవదాయ శాఖ అధికారులు

పాములపాడు: స్థానిక చౌడేశ్వరీ దేవి ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన మాన్యం వేలం పాటలకు రైతులు ఆసక్తి కనబరచకపోవడంతో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, కార్యనిర్వహణ అధికారి వెంకటరమణ వేలంను వాయిదా వేశారు. వారం రోజుల నుంచి గ్రామంలో దండోరా ద్వారా రైతులకు మాన్యం భూముల వేలం పాటల గురించి సమాచారం తెలియజేశారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే గ్రామంలోని రైతులు వేలంలో పాల్గొనలేదు. అధికారులు దాదాపు 2 గంటల పాటు వేచి చూసినా..రైతులు రాకపోవడంతో చేసేదేమిలేక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్లి పోయారు.

నష్టాలు వస్తుండటంతోనేనా ..?

ఈ సంవత్సరం రైతులకు వ్యవసాయం కలిసి రాలేదు. పంట దిగుబడులు అంతంత మాత్రంగానే ఉండటం, దిగుబడులకు గిట్టుబాటు ధరల్లేకపోవడం, వాతావరణం అనుకూలించకపోవడం రైతులను తీవ్రంగా నిరాశకు గురి చేసింది. గ్రామంలో శ్రీ చెన్నకేశవ, ఆంజనేయ స్వామి దేవస్థానం భూములు 31.08 ఎకరాలు, శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయ భూములు 19.08 ఎకరాలు, శ్రీ నాగలింగేశ్వర స్వామి దేవస్థానం భూములు 12.79 ఎకరాలున్నాయి. గతంలో మాన్యం భూములకు రైతులు పోటాపోటీగా వేలంలో పాల్గొనేవారు. ప్రస్తుతం ఒక్కరు కూడా పాల్గొనేందుకు ఆసక్తి చూపడంపై అధికారులు ఆశ్చర్యపోయారు.

యాజమాన్య పద్ధతులతో తోటలు సురక్షితం



తమలపాకు తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి హరిచందన

పాములపాడు: తోటల పెంపకంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానశాఖ అధికారి హరిచందన అన్నారు. శనివారం మండలంలోని ఇస్కాల గ్రామంలో తమలపాకు తోటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ భారీ గాలుల వల్ల తోటలు దెబ్బతిన్నాయని చెప్పారు. 19-19-19 ద్రావణాన్ని లీటరు నీటిలో 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. పడిపోయిన చెట్లను తీగలను తిరిగి నిలబెట్టి మట్టి ఎగదోయాలన్నారు. ఆకుమచ్చ, కుళ్లు రోగం రాకుండా కార్బండిజం ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి మొక్కల మొదలు దగ్గర పోయాలని సూచించారు. మిరప. ఇతర కూరగాయల పంటలు అధిక వర్షాలకు గురైనప్పుడు ముందుగా పొలం నుంచి నీటిని బయటకు పంపించాలని, మొక్కలు వాలిపోకుండా నిలబెట్టి మట్టిని ఎగదోయాలలన్నారు. మొక్కలు తేరుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాముల యూరియా చొప్పున వారానికి 2 సార్లు పిచికారీ చేయాలని వివరించారు. ఉల్లిగడ్డలు కుళ్లిపోకుండా ఉండటానికి కార్బండిజమ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి మొక్కలు మొదలు వద్ద పోయాలని తెలిపారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

కొత్తపల్లి: మామిడి సాగు చేసిన రైతులు జాగ్రత్తలు పాటించి కాయలు రాలిపోకుండా చూసుకోవాలని ఆత్మకూరు ఉద్యాన శాఖ అధికారిని కే చందన సూచించారు. శనివారం దుద్యాల గ్రామం మామిడి తోటలోని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈదురు గాలులు, వర్షం వల్ల మామిడి కాయలు రాలిపోయాయన్నారు. మిగిలిన వాటిని కాపాడుకునేందుకుగాను 19-19-19 5 గ్రాములు లీటర్ నీటికి చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. దుద్యాల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శేషు,రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టం రద్దయ్యేంత వరకు పోరాటం



మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

నందికొట్కూరు: వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రద్దయ్యేంత వరకు పోరాటం ఆగదని వామపక్ష పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, లాజరస్, అర్లప్ప, నవీన్, పబ్బతి శివ, ఏసన్న పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వామపక్ష ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 23వ తేదీన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ర్యాలీ నిర్వహిస్తునట్లు చెప్పారు. పార్లమెంట్‌లో మూజువాణి ఓటుతో బిల్లు నెగ్గినట్లు గొప్పగా చెప్పగా చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. మతాల మధ్య తగాదాలు పెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. ఆవాజ్ కమిటీ నాయకులు అబూబక్కర్, సిద్ధిక్, పఠాన్ సలాంఖాన్, ముస్లిం మత పెద్దలు, ప్రజా సంఘాల నాయకులు బీబీ, సుధాకర్, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

కూలీలకు మెడికల్ కిట్లు అందించాలి



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ, కార్మిక సంఘం నాయకుడు

ఆత్మకూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి కూలీల బిల్లులు విడుదల కాలేదన్నారు. దీంతో కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీలకు మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్లు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎండలో కూలీలు పనులు చేస్తూ సొమ్మసిల్లి పడిపోయే పరిస్థితి నెలకొందన్నారు.

హానికరమైన రసాయనాలతో కలుషితం



సేకరించిన వ్యర్థాలను చూపుతున్న దృశ్యం

మహానంది: ఈ-వేస్ట్ పరికరాల్లో లీడ్, మెర్క్యూరీ, క్యాడ్మియం వంటి హానికరమైన రసాయనాలు ఉంటాయని, వాటి ద్వారా భూమి, నీరు కలుషితం అవుతాయని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి తెలిపారు. తమ్మడపల్లెలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను చెత్తలో వేయకుండా ప్రామాణిక రీసైక్లింగ్ కేంద్రాలకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే నష్ట నివారణ

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి బి.భీముడునాయక్ సూచించారు. వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు శనివారం ఆత్మకూరు పట్టణంలోని సీహెచ్‌సీలో అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. డెమో ద్వారా చేసి చూపించారు. అగ్నిమాపక సిబ్బంది కరిముల్లా, గౌస్, చాంద్, రఫిక్, అన్సర్ తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పేకాట రాయుళ్ల అరెస్ట్

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన కండం శ్రీనివాస రెడ్డి, నల్ల బోతుల మద్దిలేటి, పేరం తిరుపతయ్య శనివారం పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో తమ సిబ్బందితో దాడి చేశామని తెలిపారు. నిందితుల నుంచి రూ. 4110 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. యువకుడి మృతి

నందికొట్కూరు: మండలంలోని అల్లూరు గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాల్ తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన తలారి వెంకటేశ్వర్లు కుమారుడు అశోక్‌కుమార్ గ్రామ సమీపంలో ఆరబోసిన మొక్కజొన్న పంటకు పట్టాలు కప్పేందుకు వెళ్తుండగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. మృతుడితో పాటు రామలింగం, ఆటో డ్రైవర్ సురేష్ గాయాలపాలయ్యారు. తండ్రి ఫిర్యాదు మేరకు కే సు నమోదు చేసుకున్ని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కళాశాల అభివృద్ధికి సహకరించండి

నందికొట్కూరు: డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకారం అందించాలని ప్రిన్సిపాల్ సునీత కోరారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాది నుంచి మధ్యాహ్న భోజన వసతి కల్పించాలన్నారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. పూర్వ విద్యార్థులు శ్రీరామ థియేటర్ రామిరెడ్డి, పీడీ శ్రీనాథ్, హరి సర్వోత్తమరెడ్డి, చిట్టిబాబు, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి

మహానంది: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, భక్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూడాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశించారు. రాష్ట్రంలోని ఆర్‌జేసీ, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ హోదా కలిగిన ఆలయాల అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పలు సూచనలు చేశారు. ఆలయాల వద్ద పారిశుద్ధ్య పనుల మెరుగుపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆలయ పవిత్రతను కాపాడే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్శనానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్

పగిడ్యాల: 'గురుకుల పాఠశాలలో ఎలుకల బెడద' అనే శీర్షికపై శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై డీసీఓ డాక్టర్ ఐ.శ్రీదేవి పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు ఉండే డార్మెటరీ భవనాన్ని పరిశీలించారు. ఎలుకల దాడికి గురైనట్లు అనుమానం ఉన్న పిల్లలందరికీ డాక్టర్లతో యాంటిబాటిక్ ఇంజెక్షన్లు వేయించారు. అనంతరం ఆమె ప్రిన్సిపాల్ రమణమ్మ, పాఠశాల సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

మహానందీశ్వరుని సేవలో న్యాయమూర్తి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఈశ్వర వెంకట ప్రసాద్ శనివారం పూజలు నిర్వహించారు. నవనందుల పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా స్వామివారి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ టి.నాగమల్లయ్య స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం పలికారు.



మహానందికి వచ్చిన న్యాయమూర్తి ఈశ్వర వెంకట ప్రసాద్

వ్యర్థాలతో సంపద సృష్టించేందుకు సహకరించండి



స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

- డి.పట్టాలు కొనుగోలు, అమ్మకాలు నిషేధం
- జిల్లా కలెక్టర్ రాజకుమారి

కొత్తపల్లి: వ్యర్థ పదార్థాలతో సంపద సృష్టించేందుకు అధికారులకు ప్రజలందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా కోరారు. శనివారం కొత్తపల్లి మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర-సచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు మండలంలోని కొలనుభారతి క్షేత్రం, సంగమేశ్వర ఆలయాలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా బస్టాండ్ నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించి విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ప్రతి అధికారి బాధ్యతగా పాల్గొని గ్రామాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. వ్యర్థ పదార్థాలను రీసైక్లింగ్ చేసి వాడుకలోకి తెచ్చేందుకు జిల్లాలో17 ఆర్ ఆర్ ఆర్ సెంటర్లు ప్రారంభించామన్నారు. ప్రజల వద్ద ఉన్న ప్రతి వ్యర్థాన్ని ఆ సెంటర్లకు తీసుకెళ్తే డబ్బులు చెల్లిస్తారన్నారు. మండలంలో రోడ్డుకిరువైపులా చెత్త, వ్యర్థాలు విపరీతంగా ఉన్నాయని, రాబోవు రోజుల్లో అవేవీ కనిపించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. డి. పట్టాల అమ్మకాలు, కొనుగోలు నిషేధించినట్లు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలు, రైతుల నుంచి వినతులు స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారి చింతామణి, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీ, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఎంపీపీ కుసుమలత, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఏపీవో విమలమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, వైద్యాధికారులు దీప నాగవేణి పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా: పరిసరాలను ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజరావు, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద ముందుగా స్పెషల్ ఆఫీసర్ అధ్వర్యంలో అధికారులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలోని వీధులను శుభ్రం చేయటంతో పాటు కార్యాలయంలోని వస్తువులను శుభ్రం చేశారు. మండ్లెం గ్రామంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ ర్యాలీ నిర్వహించారు.

- **పాములపాడు:** ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సరిగా పాడుచేయకపోతే పర్యావరణానికి హానికరమని నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఆర్డీఓ నాగజ్యోతి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటరు వరకు స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఈ-వేస్టును తగ్గించి భవిష్యత్తు రక్షించాలన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఇవ్వాలని, వాటికి విలువ కట్టి ప్రజలకు డబ్బు ఇస్తారని చెప్పారు. సర్పంచు మేకల భాగ్యమ్మ, మండల ప్రత్యేకాధికారి రాజు, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మ, డిప్యూటీ తమసీల్దార్ పఠాన్ బాబు, హెచ్‌డబ్ల్యూ అనిత, ఏపీఓ అలివేలుమంగమ్మ, ఏపీఎం ఉమామహేశ్వరి పాల్గొన్నారు.
- **నందికొట్కూరు:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం మండలంలోని బిజినవేముల గ్రామంలో జరిగిన స్వర్ణాంధ్ర...స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచు రవికుమార్ యాదవ్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, ఈఓఆర్డీ, సిబ్బంది, మున్సిపల్ ఏఈ దినేష్‌కుమార్, టీపీఓ రంగస్వామి పాల్గొన్నారు. అలాగే.. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జరిగిన పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.
- **పగిడ్యాల:** భావితరాల భవిష్యత్‌ను కాపాడేందుకు వాతావరణ సమతుల్యత పరిరక్షణకు పాటుపడుదామని మండల ప్రత్యేక అధికారి, సెరికల్చర్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరమేశ్వరి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ ఈ వేస్ట్, ప్లాస్టిక్ మెటీరియల్‌ను ఎక్కడ పడితే అక్కడ పారవేయరాదన్నారు. ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి

వెలుగోడు: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తాచెదారాలను కాలువలో వేయకుండా ఒక డబ్బా ఏర్పాటు చేసుకుని గ్రామపంచాయతీ చెత్త బండి వచ్చినప్పుడు అందులో వేయాలని తెలిపారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఈఓఆర్డీ మురారి, గ్రామ కార్యదర్శి సుంకన్న పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్ ర్యాలీ



ర్యాలీలో మాట్లాడుతున్న పాస్టర్‌లు



పట్టణంలో రన్ ఫర్ జీసస్ చేపట్టిన దృశ్యం

ఆత్మకూరు: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఆత్మకూరులో శనివారం రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చి నుంచి కొత్త బస్టాండ్ గౌడ్ సెంటర్ మీదుగా ఎస్పీజీ పాలెం చర్చి, ఏబీఎం చర్చి వరకు సాగింది. పాస్టర్లు కలుబండి త్యాగరాజు, బెర్నల్డ్ గుడ్ ఫ్రైడే, ఈస్టర్ విశిష్టతను వివరించారు. ఇతరులకు సహాయం చేస్తూ మంచిగా మెలగాలని సూచించారు. రన్ ఫర్ జీసస్ కమిటీ చైర్మన్ శీలం శేషు, పాస్టర్ రాజు మాట్లాడుతూ.. ఏసు జీవితం త్యాగానికి చిహ్నమని, తోటి మనుషులపై ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలనేదే జీసస్ ఇచ్చిన సందేశమని చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్‌లు రమేష్, జయరాజు, ఇసాక్‌బాబు, సామేలు, పిలోమన్, అనిల్, సుధాకర్, ఏలియా బెంజిమెన్, విజయ్, గడ్డం సత్యరాజు పాల్గొన్నారు.

- **నందికొట్కూరు:** పట్టణంలోని ప్రధాన రహదారి, వీధుల వెంట రన్ ఫర్ జీసస్ కార్యక్రమం సీఎస్ఐ టౌన్ చర్చి ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ఏసుక్రీస్తు గీతాలు, వాక్యం ప్రజలకు వివరించారు. సీఎస్ఐ టౌన్ చర్చి నుంచి వీధుల వెంట క్రైస్తవులు ముందుకు సాగారు.